తాచేరుపై హాయి హాయిగా..

- వర్షాకాలంలోనూ వంతెనపై వాహన రాకపోకలు
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.7.40 కోట్లతో రోడ్డు, వంతెన నిర్మాణం
- ఏళ్ల నాటి కష్టాలకు మోక్షం
- 40 గ్రామాల ప్రజల ఆనందం



సాగరం మీదుగా మాడుగుల వెళ్లడానికి తాచేరుపై నిర్మాణం చేపట్టిన వంతెన

మాడుగుల: ఏటా వానొచ్చినా.. వరదొచ్చినా... 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. ముంపు తగ్గేవరకూ ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోయేవి. దశాబ్దాలుగా పడుతున్న వీరి కష్టాలకు గత వైఎస్సార్‌సీపీ హయాంలో మోక్షం కలిగింది. దాంతో రూ.7.40 కోట్లతో తాచేరుపై నిర్మించిన వంతెనపై ఇప్పుడు హాయిగా ప్రజల ప్రయాణం సాగిపోతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల్లోనూ తమ రాకపోకలకు ఆటంకం కలగలేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగుల వెళ్లడానికి తాచేరు నదిపై బ్రిటిష్ కాలంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ఒక వంతెన, 30 ఏళ్ల క్రితం ఎం. కోడూరు వద్ద మరొక వంతెన నిర్మాణం చేపట్టారు. ఇవి ఏళ్ల కాలం నాటివి కావడంతో రానురాను శిథిలమయ్యాయి. ఏ క్షణంలోనైనా కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. దాంతో మండలంలో 40 గ్రామాల నుంచి సాగరం మీదుగా తక్కువ సమయంలో మాడుగుల చేరుకోవడానికి పాడేరు నుంచి మాడుగులకు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు సులువుగా రావడానికి మరో వంతెన నిర్మించాలని గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం, ప్రస్తుత వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలికల్ అడ్వైజర్ కమిటీ సభ్యుడు బూడి ముత్యాల నాయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనలో భాగంగా డి. గొటివాడ నుంచి రోడ్డుతోపాటు వంతెన నిర్మాణానికి రూ.7.40 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లోనే యుద్ధప్రాతిపదికన ఈ పనులు పూర్తి చేశారు. దీంతో మండలంలో 40 గ్రామాల రైతులు, వాహన చోదకులు మాడుగులకు సులువుగా చేరుతున్నారు.

సులువుగా రవాణా..

మండలంలో డి.గొటివాడ, సత్యవరం, గాదిరాయి, వీజేపురం, ఎం. కృష్ణాపురం, ఒమ్మలి, కింతలి, పొంగలిపాక, అవురువాడ, శంకరం, తాటిపర్తి పంచాయతీలతోపాటు పాడేరు నుంచి మాడుగుల వారపు సంతలకు సులువుగా వాహనాలుపై అటు గిరి రైతులు ఇటు మైదాన గ్రామాల రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులతో చేరుకుని విక్రయాలు చేసుకుంటున్నారు. డి.గొటివాడ నుంచి తాచేరు మీదుగా రోడ్డుతోపాటు వంతెన నిర్మించడంతో ప్రస్తుత భారీ వర్షాలకు రవాణా కష్టాలు తొలగాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



డి. గొటివాడ నుండి మాడుగుల రావడానికి చేపట్టిన రోడ్డు

50 కుటుంబాల రైతులకు మేలు

తాచేరుపై వంతెన నిర్మించడంతో మాడుగుల పట్టణానికి చెందిన 50 కుటుంబాల రైతులకు మేలు జరిగింది. ఏటా వర్షాకాలంలో వీరంతా మూడు నెలలు వరకు నరక యాతన పడేవారు. తుపాన్లు వస్తే వారం రోజులు పశువుల పాక వద్దే నివాసం ఉండేవారు. ఈ వంతెన నిర్మాణంతో తమ కష్టాలు తీరాయని రైతులు కర్రి వెంకటరావు, తూరుబిల్లి వెంకటరావు, తదితర రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బూడి కృషి ఫలితమే వంతెన



మాజీ డిప్యూటీ బూడి ముత్యాలనాయుడు కృషితోనే తాచేరుపై వంతెన నిర్మాణం పూర్తయింది. 20 గిరి గ్రామాల రైతులతో పాటు మైదాన రైతులకు రోడ్డుతోపాటు వంతెన సౌకర్యం కల్పించారు. వారు పండించిన పంటలు సులువుగా మాడుగుల వారపు సంతకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఇప్పుడు వర్షం వచ్చినా సరే గ్రామాలకు సులువుగా చేరుకుంటున్నారు.

– శోలం రమేష్, వైఎస్సార్ సీపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

కలలో అనుకోలేదు



వంతెన నిర్మిస్తారని కలలోనూ అనుకోలేదు. మండలంలో 40 గ్రామాల ప్రజలతో పాటు పాడేరు, నర్సీపట్నం వ్యాపారులు సులువుగా వాహనాలపై మాడుగుల వెళ్తున్నారు. రూ 3.40 కోట్లతో తాచేరుపై వంతెన పూర్తి చేశారు. మాడుగులలో గురు, శుక్రవారాలు జరిగే వారపు సంతలకు వెళ్లడానికి ఇబ్బందులు తొలగాయి. మా గ్రామం నుంచి పది నిమిషాల్లో మాడుగుల వెళ్తున్నాం. చాలా ఆనందంగా ఉంది. మాజీ సీఎం జగన్‌బాబుకు, బూడి ముత్యాల నాయుడికి రుణపడి ఉంటాం.

– పడాల అప్పలనాయుడు, రైతు ఎం. కోడూరు

క్లుప్తంగా

7న నల్లకొండమ్మ తల్లి పండగ



నాతవరం: స్థానిక నల్లకొండమ్మ తల్లి పండగను ఈ నెల 7న ఘనంగా నిర్వహించడానికి గ్రామ పెద్దలు నిర్ణయించారు. శనివారం వారంతా ఇక్కడ ఆలయంలో సమావేశమై వివరాలు వెల్లడించారు. పండగ సందర్భంగా గుర్రపు పందాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన గుర్రాలకు ప్రోత్సాహక బహుమతులతోపాటు షీల్డు అందజేస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, నాలుగు నుంచి ఏడో స్థానం వరకు నిలిచిన గుర్రాలకు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ. 4 వేలు, రూ.2500 అందజేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు ముగిసిన ఇంటర్న్‌షిప్



బ్యాంకు సేవలను తెలుసుకుంటున్న గిడుతూరు హైస్కూల్ విద్యార్థులు

మాకవరపాలెం: దసరా సెలవుల్లో విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ ముగిసింది. మండలంలోని గిడుతూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పది రోజులుగా పీఎం శ్రీ పథకంలో భాగంగా బ్యాంకింగ్ సేవలపై ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారంతో ఇంటర్న్‌షిప్ ముగిసిందని హెచ్‌ఎం బాబ్జీరావు, ఒకేషనల్ ట్రైనర్ పూర్ణిమ తెలిపారు. పది రోజులుగా పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. విద్యార్థు లు భవిష్యత్‌లో స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఇంటర్న్‌షిప్ ఎంతగానో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం అన్నారు.

గుల్లేపల్లిలో అన్నసమారాధన



కె.జె.పురంలో చద్ది కార్యక్రమంలో భక్తులు

కె.కోటపాడు: మండలంలో గుల్లేపల్లిలో దుర్గాదేవి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రులు ముగిసిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గుల్లేపల్లి, గొండుపాలెం, చౌడువాడ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రసాదా న్ని స్వీకరించారు.

కె.జె.పురంలో భక్తులకు చద్ది

మాడుగుల రూరల్: దసరా ఉత్సవాలు ముగిసిన సందర్భంగా కె.జె.పురంలో శనివారం రాత్రి భక్తులకు చద్ది కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా అమ్మవారి నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళల కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

121 పశువులకు గర్భకోశ పరీక్షలు



పశువైద్య సేవలను ప్రారంభిస్తున్న సర్పంచ్ రమణ

కె.కోటపాడు: పశువుల్లో గర్భకోశ సమస్యలకు సకాలంలో వైద్య సేవలందించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రెడ్డి నీలయ్య తెలిపారు. విశాఖపట్నం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలో పోతనవలసలో శనివారం గర్భకోశ చికిత్సల నిర్వహణపై వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశువైద్యాధికారి ఎస్.సౌజన్య, కొరువాడ, చౌడువాడ పశువైద్యాధికారులు సింహాచలంనాయుడు, సిహెచ్.వై. నాయుడు పాల్గొని 121 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. లింగ నిర్ధారిత వీర్యం అందుబాటులో ఉందని డీడీ నీలయ్య తెలిపారు. ఆడ పెయ్యల జన్మించేందుకు కేవలం రైతులు రూ.150 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. తొలుత వైద్య శిబిరాన్ని సర్పంచ్ చిరికి రమణ ప్రారంభించారు. పశువైద్య సహాయకులు హనుమంతు, సుధ, మంగ, గోపాలమిత్ర గోవింద పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ బాలకృష్ణ

మాకవరపాలెం: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు అధికారులకు సూచించారు. ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, తదితర సమస్యలపై అధికారులు సకాలంలో స్పందించాలన్నారు. అనంతరం శాఖల వారీగా ప్రగతి నివేదికలను అధికారులు సభ్యులకు వివరించారు. ఏవో అప్పారావు మాట్లాడుతూ మండలంలో 1,400 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు వరిసాగు చేపట్టారన్నారు. విద్యుత్ శాఖ ఏఈ బాలకృష్ణ మాట్లాడుతూ నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెలుగు ఏపీఎం మంగ మాట్లాడుతుండగా మాజీ ఎంపీపీ సత్యనారాయణ అడ్డుతగిలారు. వెలుగు మహిళా మార్ట్‌లో డ్వాక్రా మహిళలు సరుకులు కొంటేనే రుణాలిస్తామని బెదిరింపులకు దిగడం ఏంటని ప్రశ్నించారు. తక్కువ ధరలకు సరుకులు విక్రయించాల్సిన ఈ మార్ట్‌లో నాసిరకం సరుకులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని నిలదీశారు. బలవంతంగా సరుకులు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు లక్ష్మి, రాజారావు, డిప్యూటీ ఎంపీడీవో మేరీజోన్స్ పాల్గొన్నారు.

తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్నాం

సాక్షి ఎఫెక్ట్..

గొలుగొండ: వరి పంటకు సోకే అన్ని రకాల తెగుళ్లపై రైతులకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని వ్యవసాయశాఖ అధికారి సుధారాణి తెలిపారు. 'వరిపై తెగుళ్ల దాడి' అనే కథనం సాక్షిలో శనివారం వెలువడింది. దీనికి ఆమె స్పందించి కొంకసింగి, నాగాపురం, ఏఎల్‌పురం తదితర ప్రాంతాల్లో తెగుళ్ల అధికంగా ఉన్న ప్రాంతాల్లో పర్యటించారు. తొలిదశలో ఉన్న సుడిదోమ, తెల్లవీపు మచ్చ దోమలు నివారణకు వేప నూనె పిచికారీ చేయాలన్నారు. వరిపైరు తెగుళ్ల ఉధృతంగా ప్రారంభ దశలో ఉంటే ఎస్‌ఫేట్, లేదా ఇమిడాక్లోప్రిడ్ లేదా ఎథిప్రోల్ పిచికారీ చేయాలన్నారు ఉధృతంగా ఉంటే పై మెట్రోజైన్ లేదా ఫ్లోనికామిడ్ లేదా, ట్రైఫ్లుమిజో వంటి పురుగు మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయడం వల్ల పంటకు ఇబ్బందులు ఉండవన్నారు. అధికంగా పురుగు మందులు వాడకం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుందని వ్యవసాయశాఖ సూచనలు, సలహాలు పాటించాలని కోరారు.



కొంకసింగిలో వరి పంట తెగుళ్లు పరిశీలిస్తున్న ఏవో

స్త్రీశక్తి పథకంతో జీవనోపాధికి గండి

ఎమ్మెల్యే బండారు ఎదుట ఆటో డ్రైవర్ల వేదన



దేవరాపల్లిలో ఆటో డ్రైవర్లకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి/చోడవరం: ఆటో డ్రైవర్ల సేవలో భాగంగా శనివారం మాడగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కె.ఎస్.ఎన్.ఎస్ రాజు రూ.15 వేల సాయం చెక్కు అందజేశారు. దేవరాపల్లి టీటీడీ కల్యాణ మండపంతోపాటు చోడవరంలో ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని నిర్వహించారు. మాడుగుల నియోజకవర్గంలో 2,387 మందికిగాను రూ. 15 వేలు చొప్పున 3 కోట్ల 58 వేల 5వేల రూపాయలను ఖాతాల్లో జమ చేశామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు తెలిపారు. అదే సమయంలో పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకంతో తమ జీవనోపాధికి గండి పడిందని, ప్రస్తుతం ఇస్తున్న రూ.15 వేలు కనీసం వాహనానికి అవసరమైన ధ్రువపత్రాలకు సైతం సరిపోవని, ప్రభుత్వం పునరాలోచించి ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆటో ర్యాలీ నిర్వహించారు. మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, డీఎల్‌డీవో ఎస్.మంజులవాణి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ పీ లక్ష్మీదేవి, ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మాడుగుల రోడ్డు

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగుల వెళ్లడానికి వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఘాట్‌రోడ్ జంక్షన్ నుంచి మాడుగులకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి గోతులమయంగా మారింది. వర్షం కురిస్తే పొలాలు నిండి వరద నీరు రోడ్డుపై పారడంతో గోతులు కనిపించక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం రోడ్డుకు మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు.



మాడుగుల రోడ్డుపై పారుతున్న వరద నీరు

నిరుద్యోగులను ప్రోత్సహిస్తున్న ఎస్‌ఐకు ప్రశంస



ఎస్‌ఐ తారకేశ్వర్రావు కుటుంబ సభ్యులను సన్మానం చేస్తున్న దృశ్యం

గొలుగొండ: నాతవరం ఎస్‌ఐ తారకేశ్వర్రావు నిరుద్యోగులకు పోటీ పరీక్షల పుస్తకాలు ఇచ్చి ప్రోత్సహించడం ప్రశంసనీయమని స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం కృష్ణదేవిపేటలో ఎస్‌ఐ తారకేశ్వర్రావుతోపాటు అతని కుటుంబ సభ్యులను స్పీకర్‌తోపాటు అడిషనల్ ఎస్పీ దేవిప్రసాద్, డీఎస్పీ శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పోలీసులు, వర్తక సంఘం ఆధ్వర్యంలో నడుపుతున్న అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు ఇవ్వడం వల్ల కేడీపేట నుంచి 11 మంది నిరుద్యోగులకు డీఎస్సీ ఉద్యోగాలు వచ్చాయన్నారు. రోజూ ఇక్కడ యువకులను హైస్కూల్ గ్రౌండ్‌కు తీసుకువచ్చి సన్మార్గంలో నడిపిన ఘనత తారకేశ్వర్రావుదేనన్నారు. నాతవరం బదిలీపై వెళ్లినా కృష్ణదేవిపేటలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు పోలీస్ ఉన్నతాధికారులు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం ఆయన పనితనానికి నిదర్శనమన్నారు. అనంతరం తారకేశ్వరరావు భార్య, తల్లికి ఘన సన్మానం చేశారు.

ప్రమాదకరంగా కందిగెడ్డ వంతెన



రక్షణ గోడలు లేని కందిగెడ్డ వంతెన

కె.కోటపాడు: మండలంలో గవరపాలెం–కొరువాడ జగన్నాథపురం గ్రామాల మధ్య కందిగెడ్డపై వంతెన ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ వంతెన నిర్మించి 27 ఏళ్ల గడుస్తున్నా నేటికి ఇరువైపులా రక్షణగోడలు ఏర్పాటు చేయలేదు. ఈ వంతెన మార్గంలో కె.కోటపాడు మండల ప్రజలు విజయనగరం, కొత్తవలస ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో వాహనదారులు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో వంతెనపై ఎదురెదురుగా వాహనాలు తప్పించుకునే సమయాల్లో రక్షణ గోడలు లేక పలుమార్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు పరిశీలించి, త్వరితగతిన రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు గోతుల్లో వర్షం నీరుతో ఇక్కట్లు



రోలుగుంట రోడ్డు గోతులో వర్షం నీరు

రోలుగుంట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. ఈ వర్షాలకు రోలుగుంట ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. చిన్నపాటి చినుకులకు గోతులు నిండిపోతున్నాయి. కాలువలు పూడికలతో ఉన్న కారణంగా వర్షపు నీరు రోడ్డుపైనే పారుతోంది. వాహన చోదకులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. కొత్తవారైతే అదుపు తప్పి గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గోతులు పూడ్చి ప్రమాదాల బారి నుంచి కాపాడాలని వాహనచోదకులు కోరుతున్నారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలి

- కాంగ్రెసు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండలరావు



మాట్లాడుతున్న కొండలరావు తదితరులు

మాడుగుల: చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన వేలాది మంది రైతులకు ఆధారమైన గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి నిధులు మంజూరు చేయించి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు డిమాండ్ చేశారు. శనివారం మాడుగులలో ఆయన మాట్లాడుతూ మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్ అయ్యన్నపాత్రుడు కలసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి నిధులు మంజూరు చేయించి అటు రైతులు, ఇటు కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడాలన్నారు. లేదంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారని హితవుపలికారు. గతంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫ్యాక్టరీకి నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెసు పార్టీ నాయకుడు కామిరెడ్డి పాత్రినాయుడు, యువజన నాయకుడు ఏసురాజు, మండల అధ్యక్షుడు పాతరపల్లి రాంబాబు, పిల్ల అప్పారావు పాల్గొన్నారు.

నేడు ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ

నర్సీపట్నం: తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో ఆదివారం శ్రీమన్నారాయణ శ్రీలహరికృష్ణ దివ్య సముఖమున దేశ వ్యాప్త ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీలహరికృష్ణ భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావచ్చన్నారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవం



వంటర్లపాలెంలో దుర్గమ్మను ఊరేగింపు చేస్తున్న దృశ్యం

రావికమతం: దొండపూడి హైస్కూల్ కాలనీలో కనకదుర్గాదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవికి పలు రకాల పిండి వంటలతో సారె సమర్పించారు. లడ్డూ బహిరంగ వేలం పాట నిర్వహించడంతో భక్తులు పోటీపడి పాడారు. అనంతరం మహిళల కోలాటాల మధ్య విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకుకెళ్లి నిమజ్జనం చేశారు.

వంటర్లపాలెంలో..

మాడుగుల రూరల్: వంటర్లపాలెంలో దుర్గమ్మ విగ్రహాన్ని శనివారం గ్రామ పురవీధుల్లో ఊరేగించి తాచేరు నదిలో ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ ఊరేగింపులో కె.జె.పురం మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. గురు భవానీ దండి నర్సింగరావు, గ్రామస్తులు సారధ్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.



వంటర్లపాలెంలో వేలంలో లడ్డూను దక్కించుకున్న వెంకటేశ్



దొండపూడిలో దుర్గమ్మను ఊరేగిస్తున్న భక్తులు

అమ్మవారి లడ్డూ వేలం

అమ్మవారి 20 కిలోల లడ్డూ వేలం వేయగా, వంటర్లపాలెం గ్రామానికి చెందిన గంగుపాం వెంకటేశ్ అనే భక్తుడు దక్కించుకున్నాడు. ఈ వేలం పాటను గురు భవానీ దండి నర్సింగరావు, సకలా సూరిబాబు, గ్రామస్తులు, భవానీ భక్తులు సారధ్యంలో నిర్వహించారు.

బల్క్‌డ్రగ్ పార్క్ రద్దు చేయాలంటూ ధర్నా

నర్సీపట్నం: నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్క్‌ను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామునాయుడు మాట్లాడుతూ ఇప్పటికే హెట్రో కంపెనీ వల్ల ఉపాధి కోల్పోయి, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం సముద్ర తీరాన్ని డంపింగ్‌యార్డుగా మార్చి మత్స్యకారుల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. హోంమంత్రి అనిత మత్స్యకారులను మోసం చేశారన్నారు. డీహెచ్‌పీఎస్ నాయకులు క్రాంతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తాచేరు డైవర్షన్ రోడ్డుపై వాహన రాకపోకలు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం- నర్సీపట్నం(బీఎస్) రోడ్డులో ఎట్టకేలకు రెండు నెలల తర్వాత వాహనాల రాకపోకలు సాగాయి. ఇటీవల తుపాను వర్షాలకు తాచేరు డైవర్షన్ రోడ్డు కోతకు గురైంది. కూటమి నాయకులు, అధికారులు సకాలంలో దీనికి మరమ్మతులు చేయలేదు. వీరిపై మూడు జిల్లాల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పేట గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి, వడ్డాదికి చెందిన రైతు ఇక్కడ కోతకు గురైన తాచేరు డైవర్షన్ రోడ్డు నదిలోకి దిగి కాలు జారి కొట్టుకుపోయి మృతి చెందారు. దీనిపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ స్పందించి డైవర్షన్ రోడ్డు వేసి ప్రయాణికులకు రవాణా సదుపాయం కల్పించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు కోతకు గురైన డైవర్షన్ రోడ్డు పనులు చేసి శనివారం రాత్రి నుంచి బైక్‌లు, కార్లను విడిచిపెట్టారు. రోడ్డు పటిష్టం బాగుంటే విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు రహదారుల్లో తిరిగే ఆర్టీసీ బస్సులను విడిచి పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు.



డైవర్షన్ రోడ్డుపై నుంచి వస్తున్న వాహనాలు

ఉర్లోవ డి.పట్టా భూములపై ప్రత్యేక కమిటీ

రావికమతం: ఉర్లోవ రెవెన్యూ పరిధిలోని డి.పట్టా భూముల సాగుదారుల ఉద్యమం ఫలితంగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే గోవిందరరావు, డీ వెంకన్న తెలిపారు. శనివారం కొమిర గ్రామంలో సోలం రాజిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వి.మాడుగుల మండలం ఉర్లోవ రెవెన్యూలోని 450 ఎకరాల బంజరు భూమిని రావికమతం మండలం కొమిర, మత్స్యపురం, బుడ్డిబంద తదితర గ్రామాల్లో 350 మంది ఎస్టీ, ఎస్సీ, బీసీ పేదలకు 2012లో డి.పట్టాలుగా పంపిణీ చేశారన్నారు. ఆ భూముల్లో సాగుదారుల జీడి తోటలు వేసుకుని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. 2013–14లో తీసుకొచ్చిన వెబ్‌ల్యాండ్‌లో ఈ భూముల వివరాలు నమోదు కాలేదన్నారు. దాంతో సాగుదారులకు సంక్షేమ పథకాలు, రాయితీలు, పంట రుణాలు వంటివి ఇవ్వలేదన్నారు. దీనిపై పలుమార్లు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టిన ప్రాప్తికి కలెక్టర్ గత నెల 27న జేసీ చైర్మన్‌గా నియమించి రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ గ్రామసభ నిర్వహించి నెల రోజుల్లో సర్వే చేసి రికార్డులు తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారని చెప్పారు.



కొమిరలో సమావేశమైన సాగుదారులు, సీపీఎం నాయకులు గోవిందరరావు, వెంకన్న